# హస్తం.. అయోమయం

## రెండో జాబితాతో రిక్త హస్తం..

- ఖాళీ అవుతున్న మహా నగర కాంగ్రెస్ పార్టీ
- భారీ ఎత్తున బీఆర్ఎస్‌లోకి వలసలు
- ప్రకటించిన అభ్యర్థులకు కొనసాగుతున్న సహాయ నిరాకరణ
- బీజేపీది దిక్కుతోచని పరిస్థితి
- వార్ వన్‌సైడ్‌లా.. బీఆర్ఎస్ పార్టీ ప్రచారం

హైదరాబాద్ మహా నగర పరిధిలో దాదాపు అన్ని స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. ఎక్కువ స్థానాల్లో సరైన అభ్యర్థులు లేరంటూ దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న వారిని కాదని ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇచ్చింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవుతున్న పరిస్థితి ఏర్పడింది. తొలి జాబితాతో పెద్ద ఎత్తున అసంతృప్తులు పార్టీ అధిష్ఠానంపై కన్నెర్ర జేశారు. చివరకు పాతబస్తీ పరిధిలోని నియోజకవర్గాల్లోనూ అసమ్మతి భగ్గుమని.. చివరకు గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దగ్ధం చేసేవరకు చేరింది. మేడ్చల్‌లోనూ అసమ్మతి తీవ్రస్థాయికి వెళ్లింది. ఉప్పల్‌లోనైతే ఏకంగా పార్టీ ఖాళీ అయ్యింది. కీలక నేత రాగిడి లక్ష్మారెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్‌లో చేరారు. అంతకుముందు ఆయన టీపీసీసీ రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకున్నాడని ఆరోపించడంతో పాటు నిజం కాకపోతే భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. ఆ తర్వాత అదే నియోజకవర్గానికి చెందిన ఏఎస్‌రావు నగర్ కార్పొరేటర్ శిరీష, ఆమె భర్త సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు.

### గులాబీ పార్టీలోకి వలసల జాతర

రెండో జాబితా వచ్చిన తర్వాత కాంగ్రెస్ పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహైల్ తీవ్రస్థాయిలో రేవంత్‌పై ఆరోపణలు చేశారు. ఆయన కూడా బీఆర్ఎస్‌లో చేరారు. కీలకమైన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనూ హస్తం ఖాళీ కానున్నది. ఆ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి, బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు సోమవారం అధికారికంగా ప్రకటించారు. దీంతో అక్కడ ఆయనతో పాటు పార్టీ మొత్తం బీఆర్ఎస్‌లోకి వస్తుంది. కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన మరో కీలక నేత గొట్టిముక్కల వెంగళరావు కూడా కాంగ్రెస్ పార్టీని వీడారు. త్వరలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ అసమ్మతి నేతలు పార్టీని వీడేందుకు ఇప్పటికే నిర్ణయించారు. కాకపోతే రేపోమాపో బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండటంతో గులాబీ పార్టీలోకి వలసల జాతర ఇంకా కొనసాగనున్నది.

*మూలుగుతున్న నక్కపై తాటిపండు పడ్డట్లుగా.. హైదరాబాద్ మహా నగరంలో అసలే అంతంత మాత్రంగా ఉన్న కాంగ్రెస్‌పై రెండో జాబితా పిడుగుపాటులా తయారైంది. ఉన్న పది మందిలో ఒకరికి టికెట్ ఇస్తే మిగతా వారంతా ఉడాయిస్తారని ముందుగానే ఊహించిన కాంగ్రెస్ అధిష్ఠానం రెండో జాబితా విడుదలను వాయిదా వేస్తూ వచ్చింది. కానీ తప్పని పరిస్థితుల్లో ఈ నెల 27వ తేదీన రెండవ జాబితాను విడుదల చేయగా.. అందులో మహా నగర పరిధిలో పదకొండు స్థానాలు ఉన్నాయి. దీంతో ఒక్కసారిగా ఆయా నియోజకవర్గాల్లో అసంతృప్త నేతలు భగ్గుమన్నారు. దీనికి కొనసాగింపుగా... నియోజకవర్గాల్లో టికెట్ వచ్చిన వారు మినహా మిగిలిన వారు గులాబీ పార్టీలోకి సర్దుబాటు అవుతుండటంతో గ్రేటర్ కాంగ్రెస్ ఖాళీ అవుతుంది. టికెట్ ఇచ్చిన వారికి పార్టీలో ఉన్న స్థానిక నేతలు కూడా సహకరించడం లేదు. మరో వైపు బీజేపీది కూడా ఇలాంటి దుస్థితే. కీలక స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించేందుకు కూడా ఆ పార్టీ అధిష్ఠానం సాహసం చేయలేకపోతుంది. ఇతర పార్టీల నుంచి ఎవరో వస్తారు... అని ఎదురుచూస్తున్న ఆ పార్టీ నేతలు బీఆర్ఎస్‌వైపే కాంగ్రెస్ నేతలు క్యూ కడుతుండటంతో దిక్కుతోచని పరిస్థితి. ఈ నేపథ్యంలో మహా నగర పరిధిలో ఇప్పటికే వార్ వన్‌సైడ్‌లా.. బీఆర్ఎస్ పార్టీ ప్రచారమే కనిపిస్తుంది తప్ప కాంగ్రెస్, బీజేపీ జెండాల రెపరెపలు నల్లపూసలయ్యాయి.*

**- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ)**

### ఒంటరిగానే ప్యారాచూట్ నేతలు..

కాంగ్రెస్ రెండో జాబితాలో ఎక్కువగా ప్యారాచూట్ నేతలకే టికెట్ ఇవ్వడంతో స్థానిక నేతలు, క్యాడర్ ఎవరూ వారికి సహకరించడం లేదు. ఎల్బీనగర్‌లో మధుయాష్కీ గతంలో తన వెంట ఉండే అనుచరులతోనే ప్రచారం చేసుకుంటున్నారు. కానీ స్థానిక నేతలు, కార్యకర్తలు ఎవరూ ఆయన వెంట కనిపించడం లేదు. మహేశ్వరంలో కేఎల్‌ఆర్‌కు ఎవరూ సహకరించే పరిస్థితి లేక ఆయన నియోజకవర్గానికి చుట్టపు చూపుగానే వస్తున్నారు. టికెట్ ఆశించిన చిగిరింత దంపతులు రెండు రోజుల కిందట భారీ ఎత్తున సమావేశం నిర్వహించారేగానీ ఇప్పటికీ వరకు పార్టీ అభ్యర్థి వైపు కన్నెత్తి చూడటం లేదు. మిగిలిన శ్రేణులు కూడా కేఎల్‌ఆర్‌కు సహకరించే పరిస్థితి లేకపోవడంతో నియోజకవర్గంలో కేవలం బీఆర్ఎస్ ప్రచారమే జోరుగా సాగుతుంది. కూకట్‌పల్లిలో మరో ప్యారాచూట్ నేతకు టికెట్ ఇవ్వడంతో ఆయన నియోజకవర్గంలోకి వచ్చి ప్రచారం చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. అంబర్‌పేటలో కూడా ప్యారాచూట్ నేత రోహిన్‌రెడ్డికి స్థానిక నేతలు, క్యాడర్ సహకరించే పరిస్థితి కనిపించడం లేదు.



బీఆర్ఎస్ పార్టీలో చేరిన అనంతరం మంత్రి కేటీఆర్‌కు పూలబొకే అందజేస్తున్న మైనార్టీ నాయకులు

### జంకుతున్న కమలనాథులు..

హైదరాబాద్ మహా నగరంలో పరిమిత స్థానాలకే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ.. మిగిలిన నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించే పరిస్థితి లేదు. ఆదిలో బీఆర్ఎస్ నుంచి ఎవరైనా వస్తారా? అని ఎదురుచూసిన ఆ పార్టీ నేతలకు నిరాశే ఎదురైంది. కనీసం కాంగ్రెస్ జాబితాల ప్రకటన తర్వాతనైనా ఎవరైనా వస్తే వారి చేతిలో టికెట్ పెట్టాలని చూశారు. కానీ కాంగ్రెస్ అసంతృప్తులు తెలంగాణ భవన్‌కు క్యూ కడుతుండటంతో కమలనాథులను నిరుత్సాహం ఆవహించింది. దీంతో కీలకమైన స్థానాల అభ్యర్థుల ప్రకటన ఇప్పట్లో వచ్చేలా కనిపించడం లేదు. జనసేనతో పొత్తు అంటూ మరింత కాలయాపన చేస్తున్నారు. కాగా పొత్తులో భాగంగా కూకట్‌పల్లిని జనసేనకు ఇస్తారనే ప్రచారంపై ఆ పార్టీ నేతలు భగ్గుమన్నారు. సోమవారం నాంపల్లిలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి ఈ అంశంపై తీవ్రస్థాయిలో అసమ్మతి గళం వినిపించారు.

---

# బండారి గెలుపు ఏకపక్షమే

- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థి
- కాంగ్రెస్, బీజేపీలలో కొరవడిన సక్యత
- ఆ రెండు పార్టీల నేతల్లోనూ లోపించిన సమన్వయం
- కరెక్కుతున్న ప్రతిపక్ష పార్టీల నేతలు
- అందరినీ కలుపుకొని రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లోకి
- స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్న బస్తీలు, కాలనీలు

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఏకపక్షమే కాబోతున్నది. ఈ నియోజకవర్గంలో పరిస్థితులు అలాగే ఉన్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ తరఫున ఉప్పల్ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న బండారి లక్ష్మారెడ్డి ప్రచారంలో జోరు పెంచారు. అందులో భాగంగా పలు ప్రచార రథాలు ఏర్పాటు చేయడంతో పాటు నియోజక వర్గంలోని ప్రతి డివిజన్ పరిధిలో ప్రచారం జోరుగా సాగుతున్నది. అందులో భాగంగా అభ్యర్థి ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో ఉప్పల్ నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును వివరిస్తూ ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు. ఈ నియోజక వర్గంలో దాదాపు 5.10 లక్షల మంది ఓటర్లు ఉన్నప్పటికీ వారిలో సింహభాగం కూడా బీఆర్ఎస్ పార్టీకే ఓట్లు వేయాలన్న ఆకాంక్షతోనే ఉన్నట్లు స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, క్యాడర్ తమ అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. పైగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ కాకుండా కాంగ్రెస్, బీజేపీ వంటి ఇతర పార్టీల అభ్యర్థులు గెలిస్తే.. అభివృద్ధి కుంటుపడటంతో పాటు ఎంతో మంది పేదలకు సకాలంలో అందుతున్న సంక్షేమ పథకాలు నిలిచిపోతాయన్న ఆందోళన ఉంది. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చినట్లయితే.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజక వర్గం ఊహించని విధంగా అభివృద్ధి జరుగుతుందన్న అభిప్రాయాన్ని ఇక్కడి ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.



### క్యాడర్‌లో సమన్వయ లోపం..

బీఆర్ఎస్ పార్టీ మినహా.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, క్యాడర్‌లో సమన్వయం లోపించినట్లు కనిపిస్తున్నది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల విషయంలో సమన్వయం తీవ్రంగా లోపించింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ల మధ్య పొసగడం లేదు. అయితే ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థిని నిలబెట్టినప్పటికీ ఆయనకు సీనియర్లు, జూనియర్లతో పాటు ఆ పార్టీ క్యాడర్ కూడా అంతగా సహకరించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైగా పార్టీ సీనియర్లకు కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే కాంగ్రెస్ పార్టీ టికెటు ఇచ్చిందన్న అపవాదు ఉన్నందున తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. బీజేపీ పార్టీ అభ్యర్థి ప్రచార వ్యూహాలు రచించుకుంటూ ముందుకు సాగుతుంటే, కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు మాత్రం ప్రచారంలో నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు.

### బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు తథ్యం..

ఉప్పల్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఏక పక్షమే. అందుకోసం ప్రచార జోరు, వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల ప్రకారం ఇదే జోరు నగరానికి చెందిన అన్ని నియోజక వర్గాల నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు కొనసాగిస్తున్నారు. నగరం పరిధిలో అన్ని నియోజక వర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఏకపక్షమే కాబోతున్నదని, ఇందుకు నగర అభివృద్ధి, సంక్షేమ ఫలాలు, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, తదితర పథకాలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు దోహదపడుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

---

# కూకట్‌పల్లి కాంగ్రెస్‌లో ముసలం..

## అభ్యర్థి ముందే బాహాబాహీకి దిగిన నేతలు

బాలానగర్, అక్టోబర్ 30: కూకట్‌పల్లి కాంగ్రెస్‌లో ముసలం పుట్టింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం ఖాయమైన నాలుగురోజుల్లోనే పార్టీ శ్రేణులు బాహా బాహీకి దిగారు. సోమవారం బాలానగర్ శోభన సెంటర్‌లోని ఎస్ఎంఆర్ క్యాపిటల్ భవనంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేశ్, నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి సత్యం శ్రీరంగంలు ఇతర పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి సత్యం శ్రీరంగం, కూకట్‌పల్లి నియోజక వర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డిల మధ్య గొడవకు దారి తీసింది. ఎమ్మెల్యే కృష్ణారావుకు కోవర్టు నువ్వంటే.. నువ్వే అంటూ ఒకరు నొకరు దూషించుకున్నారు. ఈ గొడవ పార్టీ శ్రేణులకు ఒకింత నిరుత్సాహాన్ని కలిగించిందని పార్టీ శ్రేణులే చర్చించుకోవడం గమనార్హం. అయితే, అభ్యర్థి బండి రమేశ్ వద్ద యుగంధర్ రెడ్డిని సత్యం శ్రీరంగం తక్కువ చేసి మాట్లాడినందునే ఇద్దరి మధ్య గొడవకు దారి తీసిందని, బండి వద్ద సత్యం శ్రీరంగం మెప్పు పొందేందుకు ఈ గొడవకు శ్రీకారం చుట్టాడని కాంగ్రెస్ శ్రేణులు చెవులు కొరుక్కుంటున్నారు. ఇదిలా ఉండగా బాలానగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభిస్తే బాలానగర్, ఫతేనగర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు సరైన సమాచారం ఇవ్వలేదని నారాజుగా ఉన్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.